


# ఇది మానవత్వం కాదా?

'కౌండిన్యస'

సుబ్బలక్ష్మి ఎప్పట్నుంచి నాటకాల్లో వేషాలేస్తోందిరా ?" నాకు యీ మధ్య కొత్తగ బయలుదేరిన అనుమానం చేత ఉండ బట్టలేక అడిగేశాను సత్తిరాజుని. "ఒరే వెర్రినాన్నా! ఇప్పుడేంట్రా అడుగుతావు. అప్పుడే ఆర్నెలు కావస్తోంది నాటకాలేస్తూ. దానికి తోడు బ్యాక్ గ్రౌండు బిజినెస్ కూడ చేస్తోందిరా!" తనకేమి పట్టనట్టు అనేశాడు. ఆ చివరిమాటలనే టప్పుడు కొంచెం తగ్గుస్థాయిలో నొత్తి పలుకుతూ నావేపు అదోలా చూస్తూ అన్నాడు. "బ్యాక్ గ్రౌండు బిజినెస్ అంటే ఏమిటిరా?" అన్నాను అర్థంగాక. 'అదే వేషం వేయటానికి వంద, అందుకు వంద" చుట్టు పక్కల కలియజూసి కొంచెం వంగి నా చెవిలో ఏదో గొణిగాడు. నేను ఆశ్చర్యపడ్డాను. "వాట్ నిజవేంరా, నిజంగా నమ్మమంటావా?" "నమ్ము నమ్మకపో, నేను చెప్పింది మున్నూటికి నిజం" "ఛ ఛ! ఏదో పొట్ట గడవక నాటకాల్లో నటిస్తోందికాని ఆవిడలాటిది కాదురా!' సత్తిరాజు ఉద్దేశ్యం తెలుసు కుందామని అన్నాను. "ఏం నాన్నా, అంత ఇంటరెస్టుగా అడుగుతున్నావు, ఏంటి కథ?" నేను మరేమి మాటాడ కుండా ఊరుకున్నాను.

నిజానికి సుబ్బలక్ష్మి చాలా అందమైనది. కోలగా చక్కని ముఖం. కని కనిపించనట్టుండే నడుము. ఇసుక తిన్నెల్లాగ ఎత్తయిన పిరుదులు. అన్నిటికంటె ముందుగా ఆకర్షించే పాపికొండల్లాగుండే సమున్నతాలయిన వక్షోజాలు. సింపుల్‌గా చెప్పాలంటే సుబ్బలక్ష్మి స్ట్రక్చర్ ఇంతే. ఆమె రోడ్డుమీద నడిచి వెళ్తే చాలు. ట్రాఫిక్ బందయిపోయేదంటే ఎంత అందమయినదో ఊహించి చెప్పలేం. నాలోని తృష్ణ విజృంభించింది. శరీరం గగుర్పొడిచింది.

* * *

'అతకని బ్రతుకులు' అనే సాంఘిక నాటిక ప్రఖ్యాత నటి సుబ్బలక్ష్మి తదితరులు అని రాసిన బోర్డు మెయిన్‌రోడ్డులో వేలాడగట్టారు. తప్పకుండా ఆ రోజు చూడ్డానికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. ఆ రోజు రానేవచ్చింది. ప్రేక్షకులతో హాస్టల్ హాలంతా కిక్కిరిసిపోయింది. ప్రదర్శనకు ముందుగా రికార్డులు వేస్తున్నారు. ప్రేక్షకుల చప్పట్లతో, ఈలలతో, హాలంతా సందడిగా ఉంది. ప్రతీ ఒక్కరు సుబ్బలక్ష్మి అందాన్ని గురించి ఊహించుకుని గాలిలో తేలిపోతున్నారు. నాటిక చూట్టంకన్న ముఖ్యంగా ఆమె ఒంపుసొంపులు, అందాన్ని చూడాలని తహతహలాడుతూ వచ్చినవాళ్ళే. పది నిముషాల్లో ప్రారంభమవుతుందని మైక్‌లో చెప్పబడింది. ప్రేక్షకుల్లో నిశ్శబ్దం ఆవరించింది. నేను కుర్చీలోంచి లేచి గ్రీన్‌రూమ్‌కేసి నడిచాను. ఇంతలో ఆర్గనైజరు అప్పారావు, సత్తిరాజు కనిపించారు. వాళ్ళు నన్ను తీసుకెళ్ళి సుబ్బలక్ష్మితో పరిచయం చేశారు. ఆమె ముఖానికి రంగువేసుకుంటోంది. ఒకమారు తలెత్తి చూసి నవ్వుతూ 'నమస్కారం' అంది. నేను ప్రతి నమస్కారం చేశాను. అప్పారావు, సత్తిరాజు నన్ను అక్కడే వదిలి ఏదో పనిమీద బయటికివెళ్ళిపోయారు. నాకు కొంచెం ఇబ్బందిగ అనిపించింది. కాని నాలోకోరిక నన్ను తొందర పెట్టసాగింది. నేనే కల్పించుకుని ఆమెతో మాటామాటికి దిగాను. "నా పేరు మూర్తి అంటారండీ! మామామయ్య యీ ఊరు ప్రెసిడెంటు" హుందాగా, ఠీవిగా, చెప్పాను.

ఆమె ఎందుకో నాకళ్ళలోకి అనుమానంగా చూసింది. ఆచూపులు మన్మధుని విరిబాణాల్లాగ తగిలాయి. పోలికతో క్రిందిపెదవిని చప్పరిస్తూ ఆమెకేసి ఆశగా చూశాను. నాలో యౌవనాన్ని బహుశా కనిపెట్టింది, గాబోలు మేకప్ త్వరగా పూర్తిచేసుకుని లేచినుంచుంది. ఇంక దయచేయండన్నట్టు. ఆర్గనైజరు అప్పారావు హడావుడిగా గ్రీన్‌రూమ్‌లోకొచ్చి సుబ్బలక్ష్మిని త్వరగా తెమలమన్నాడు. నేను నాసీటుదగ్గర కొచ్చి తెరకేసిచూస్తూ కూర్చున్నాను.

బ్లూ కలర్ బెర్లిన్ కర్టెన్ ఒయ్యారంగా పక్కకి ముడుచుకుంది. సుబ్బలక్ష్మి స్టేజి మీదకు వచ్చింది. ఏదో గీతం ఆలాపిస్తోంది. అబ్బ ఎంత మధురంగా ఉంది ఆమె కంఠం. నిజంగా సుబ్బలక్ష్మి పూర్వ జన్మ సుకృతం లేకపోతే అంత అందం, దానికి తగిన అవయవాల పొందిక, నటన, పైగా కోకిల కంఠం. వింత వింత ఫోకసింగులతో ద్విగుణీకృతమైన అందంతో అపర రతీ దేవిలా కనబడుతోంది. తన్మయత్వంతో నాటిక ముగిసే వరకు అలానే కూర్చుండి పోయాను. నాటిక చివర నటీ నటులను పరిచయం చేశారు. చాలామంది వాళ్ళ వాళ్ళ నటనని మెచ్చుకుని త్రాణమో పణమో చదివిస్తున్నారు. ఎక్కువగా సుబ్బలక్ష్మికి ప్రజంటేషనుగా ఇచ్చేవాళ్ళే. నేను జేబులోంచి మూడొందలు తీశాను. అవి పట్టుకుని స్టేజి మీద కెళ్ళి స్వయంగా సుబ్బలక్ష్మి చేతిలో పెట్టాను. ఆమె నటనని మెచ్చుకుంటూ ఏదో పొగిడాను. సుబ్బలక్ష్మి నాకేసి కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. ఆ చూపులకి నా హృదయం దూదిపింజలా గాలిలో తేలిపోయింది ప్రేక్షకులులేని హాలంతా బోసి పోయింది పనివాళ్ళు కుర్చీలు వగైరా సర్దుతున్నారు. అప్పారావు నన్ను గ్రీన్ రూములోకిపిలిచాడు "చూడు మూర్తీ ఏమి అనుకోకపోతే యీరాత్రికిసుబ్బలక్ష్మి మీ ఇంటిదగ్గర పడుకుంటుంది మీమామయ్యగారేమి అభ్యంతరంచెప్పరుకదూ.' నాకునోటంటమాటరాలేదు ఒంట్లో కొంచం ఒణుకు పుట్టుకొచ్చింది. రిక్షానిపిల్చి ఎక్కి కూర్చున్నాను. సుబ్బలక్ష్మి అభ్యంతరం చెప్పకుండ రిక్షాలో నాపక్కన కూచుంది రిక్షా కుదుపులకి నా భుజం ఆమెభుజాలకి తగులుతుంటే ఎంతో వెచ్చదనాన్ని కలుగజేస్తోంది. "మీఇల్లెక్కడండి" ఇంకేమి మాట్లాడాలో తెలియక అడిగాను. "స్టేషను దాటి కంటోన్మెంటుపోవాలి. అంచేత యీరాత్రికి మీఇంట్లో పడుకుంటాను" మృదువుగా చెప్పింది. గేటుముందు రిక్షా ఆపాడు. నేను దిగి గేటుతలుపు తీసి ముందు నడిచాను. వెనకాలే సుబ్బలక్ష్మి హేండ్ బ్యాగ్ పట్టుకుని వస్తోంది. మామయ్యతోచెప్పి మేడ మీద కుడిచేతివేపుగదిలో పక్కవేయించాను. నేను ఆమెను గదివరకు దిగబెట్టి ఏంకావాలన్నా బిడియం లేకుండా అడగమనిచెప్పి దాన్ని ఆనుకునివున్న ప్రక్కగదిలోకి వెళ్ళి పడుకున్నాను.

* * *

రిస్టువాచీకేసి చూచుకున్నాను. 12 గంటలు చూపుతోంది. కొంతసేపు మంచంమీద దొర్లాను. నిద్ర పట్టలేదు. లేచి తలుపు సందులోంచిచూశాను. ఆమె సుఖంగా నిద్రపోతున్నట్టుంది, నిద్రలో సగం సమిట తొలిగిపోయింది. ఊపిరి పీల్చేటప్పుడు ఎత్తైన వక్షోజాలు ఎగిరెగిరి పడుతున్నాయి. ఫాను గాలికి ఆమె ముంగురులు లయబద్ధంగా కదులుతున్నాయి. నెమ్మదిగ తలుపుతీసి అడుగులోఅడుగు వేసుకుంటూ ఆమెను సమీపించి బలవంతంగా ముద్దు పెట్టుకోబోయాను. ఆమె తుళ్ళిపడిలేచింది. బలవంతంగా నా గుండెలకి హత్తుకోబోయాను. సుబ్బలక్ష్మి కంగారుగా నా నుండి విడిపించుకుని దూరంగా నిలబడింది దెబ్బతిన్నలేడిలా. "మూర్తీ! ఇంత రాత్రివేళ ఒంటరిగా నా గదిలోకి రావటం బాగుందా" గద్దించి అడిగింది. "నా కళ్ళకి మైకం కమ్మింది సుబ్బలక్ష్మీ ! ప్లీజ్ నా కోరిక చెల్లించు. మూడొందలే కాదు. నీ క్కావలసినంత ఇస్తాను. ఇందాక నీకిచ్చిన మూడొందలు నీ నటన్ని మెచ్చుకుని కాదు. నిన్నూ నీ అందాన్ని మెచ్చుకుని ఇచ్చాను. నా దాహం తీర్చి పుణ్యం కట్టుకో" ఉద్రేకంతో పై పంటితో క్రింది పెదవిని కొరుకుతూ అన్నాను. నా కళ్ళు ఎర్ర బారాయి రోమాలు నిక్క బొడుచుకున్నాయి "మూర్తీ! మీరంటున్నది నా కర్థం కావటంలేదు." తడబడుతూ అంది సుబ్బలక్ష్మి. "ఏమి తెలియనట్టు కొత్తగా మాటాడుతున్నావు. ఎందుకింకా ఆలస్యం. నీ గురించి సత్తిరాజుచెప్పాడు ఎప్పట్నుంచోనాలో దాగియున్నకోరిక ఇన్నాళ్ళకి నెరవేరుతోంది." ఆమె చను గుబ్బలకేసి ఆశగా చూస్తూ అన్నాను నా చెంప ఛెళుక్కుమంది. కళ్ళు బైర్లు కమ్మాయి. మైకం వదలి పోయింది. సుబ్బలక్ష్మి కోపంతో నిలువెల్లా ఒణికి పోతోంది.

"ఛీ! పాడు సమాజం. పాడు మనుషులు. పురుషునితోబాటు స్త్రీకి సమానహక్కు నిచ్చామనడమే గాని స్త్రీ స్వేచ్ఛగా తిరిగితే చాలు. కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారు. లేనిపోని అభాండాలు, అపనిందలూ నెత్తిన రుద్ది తలెత్తుకుని తిరక్కుండా చేస్తారు. నాటకాల్లో వేషాలేస్తూ పురుషునితో చొరవగా తిరిగినంత మాత్రాన ఆమె శీలం చెడిందని పతిత అని అనడం న్యాయమేనా? మనం వైజ్ఞానికంగా ఎంతో ప్రగతిని సాధించాము కాని మానసికంగా సాధించలేక పోయాం. ఏవేవో సంకుచిత భావాలతో, దురభిప్రాయాలతో పరమ అనాగరికులమై పోతున్నాం. రోడ్డుమీద ఏఅన్నా చెల్లెలో, తండ్రీకూతురో కలిసి వెళ్తున్నంతమాత్రాన వాళ్ళకేసి వింతగాచూస్తూ వెనుకముందు లాలోచించకుండా అక్రమసంబంధాలు కల్పించటం మనకుబాగా అలవాటయిపోయింది. ఇది మానవత్వమేనా? పశువులకన్న నీచాతినీచంగా హేయంగా ప్రవర్తిస్తున్నాం. ఇటువంటిమాటలతో అపోహలతో వాళ్ళలో వుండే కళా నైపుణ్యాన్ని చేతులారా నాశనం చేస్తున్నాం. నూటికి సగానికి పైగా చాలామంది ఇటువంటి అవమానాలకు వెరచి తమలోవుండే కళని బహిర్గతం చెయ్యలేక పోతున్నారు" నా కళ్ళలోకి సూటిగా నిశితంగా చూస్తూ అంది, ఆ చూపులు ఇందాకటిలా లేవు. వాటి వెనుక ఎంతో బాధ వ్యక్తమవుతోంది. "నన్ను క్షమించు సుబ్బలక్ష్మీ ! సత్తిరాజు చెప్పిన మాటలు విని నిన్ను అపార్థం చేసుకుని ఇలాటి నికృష్ట వృత్తికి తలపడ్డాను" ఆమెకేసి సూటిగా చూడగలేక తలదించుకున్నాను. "సత్తిరాజు లాంటి చెద పురుగులింకా యీ సంఘంలో అక్కడక్కడ లేకపోలేదు. వాళ్ళకి కనిపించిన ఆడదల్లా చెడిందనడంలో అదో రకమైన తృప్తి. కాని వాళ్ళు పడే వ్యధని అర్థం చేసుకోలేరు." ఆమె కళ్ళ నుంచి చెంపల మీదుగా రాలిన నీళ్ళు చారలు కట్టాయి. బ్యాగ్‌లోంచి నోట్లు తీసి నా కేసి చటుక్కున విసిరి అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. గాలికి నోట్లు రెప రెప లాడాయి. నన్ను హేళన చేస్తున్నట్టు.

★

